క్లుప్తంగా

ఘనంగా బండ్ల ఊరేగింపు



బండ్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మర్కూక్(గజ్వేల్): వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వర్దరాజ్‌పూర్ గ్రామంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం చందన గోష్టి, పండిత సన్మానం, కంచి గరుడసేవ, అనంతరం హనుమాన్ ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి పూజలు చేశారు. అదేవిధంగా ఎడ్లబండ్లను పూజించి ఆలయం చుట్టూ ఊరేగించారు. సర్పంచ్ ప్రవీణ్, ముదిరాజ్ సంఘం జగదేవ్‌పూర్ మండలాధ్యక్షుడు రాజు స్వామివారికి పూజలు చేశారు.

కుక్కల దాడిలో మేకలు మృతి



మృతి చెందిన మేకలు

చేర్యాల(సిద్దిపేట): కుక్కల దాడిలో ఏడు మేకలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని బింగి ఎర్రొల్ల బాలయ్యకు చెందిన మేకల మందపై కుక్కలు దాడి చేశాయి. దాడిలో ఏడు మేకలు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. దీంతో సుమారుగా రూ.80వేల నష్టం వాటిల్లిందని, సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకొని ఇలాంటి దాడులు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు



నీటిశుద్ధి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్ జెడ్పీటీసీ బాలుయాదవ్ తన తల్లి మామిండ్ల నర్సమ్మ స్మారకార్థం గుంటిపల్లి గ్రామంలో రూ.లక్షన్నర విలువైన నీటిశుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ బాలుయాదవ్, సర్పంచ్ హన్మంతుతో కలిసి ప్రారంభించారు. అనేక వ్యాధులకు కలుషిత తాగునీరు కారణమని, సురక్షిత తాగునీరు అందించే యూనిట్‌ను ఉదారంగా బాలుయాదవ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతులు అందిస్తున్న చైర్‌పర్సన్ వనిత, సీడీపీవో చంద్రకళ

దుబ్బాకటౌన్: అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను సైతం సీఐటీయూ చేపడుతుండడం అభినందనీయమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితా భూంరెడ్డి అన్నారు. మేడే వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళతో కలిసి చైర్‌పర్సన్ హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంచి కార్యక్రమాలకు తమ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ మెదక్ జిల్లా అధ్యక్షుడు భిక్కనూరు ఎల్లయ్య, రాజిరెడ్డి, సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, టౌన్ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, మల్లేశం, శ్రావణ్, దివ్య, జయ, బాల్‌లక్ష్మీ, వాణి, మానస ఉన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్: అంధత్వాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావించి చేపడుతుందని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 15, 16వార్డుల్లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అర్చన, భాగ్యలక్ష్మీతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



వేలూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, దీంతో వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతూ అద్భుత ఫలితాలు సాధిస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం వేలూరు, తున్కిఖాల్సా, నెంటూరులో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి, పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణంతో ఖరీఫ్‌లో రాష్ట్రం 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించి రికార్డు సృష్టించిందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలుయాదవ్, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, ప్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, మండల రైతు కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, సర్పంచ్‌లు పాపిరెడ్డి, సంధ్యాజాని, ఎంపీటీసీ షాదుల్లాగౌడ్, నాయకులు నాగరాజు, యాదగిరిగౌడ్, విద్యాకుమార్, నర్సింలు, సీఈఓ జితేందర్‌రెడ్డి, ఏఓ శేషశయన పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. శుక్రవారం రాజగోపాల్‌పేట,



మిరుదొడ్డి(దుబ్బాక): జంగపల్లిలో..

రాంపూర్, అంక్షాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, లింగంగౌడ్, రాజుగౌడ్, మల్లేశం, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ బీమనపల్లి కరుణాకర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అయిలయ్య, రవీందర్‌రెడ్డి, సీఏలు భాగ్య, శైలజ, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, సర్పంచ్ కంచం యాదగిరి ఐకేపీసీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తేమ, తరుగు పేరుతో కోతలు



నంగునూరులో ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న యాదగిరి

నంగునూరు(సిద్దిపేట): తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా తేమ శాతం, తరుగు పేరుతో కోతలు విధిస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. శుక్రవారం నంగునూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. తడిసిన వడ్లు కొంటామని మంత్రి హరీశ్‌రావు గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. రైస్ మిల్లర్లు క్వింటాల్‌కు మూడు నుంచి ఐదుకిలోల కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని చెప్పారు. ఆయన వెంట రాజు, వీరయ్యగౌడ్, రాములు, బాలయ్య, కనకయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

వంటావార్పుతో నిరసన



భోజనం చేస్తున్న జేపీఎస్‌లు

సిద్దిపేటరూరల్: నోటిఫికేషన్‌లో భాగంగా 4 ఏళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న జేపీఎస్‌లు రెగ్యులరైజేషన్ కోసం చేస్తున్న న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం నెరవేర్చాలని జేపీఎస్‌ల జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జేపీఎస్‌లు రెగ్యులరైజేషన్ కోసం చేస్తున్న సమ్మె 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేపీఎస్‌లు వంటావార్పు కార్యక్రమం చేపట్టి శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వంపై శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తూ తమ డిమాండ్లను సాధించుకుంటామన్నారు. సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న గ్రామాల సర్పంచ్‌లు, పలు పార్టీల నాయకులు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాయపోలు మండలం బేగంపేట సర్పంచ్ ప్రవీణ్, ఎల్కల్ సర్పంచ్ శ్యామలకుమార్‌లు మద్దతు తెలిపారు.

రెగ్యులర్ చేయాలని మంత్రి కేటీఆర్‌కు వినతి



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, వంద శాతం రెగ్యులర్ చేయాలన్న ఉద్దేశంతోనే ఉన్నామని రాష్ట్ర ఐటీ, పురపాలక మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, భారీ బహిరంగ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానా ప్రారంభోత్సవం అనంతరం పంచాయతీ కార్యదర్శులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనవసరంగా సమ్మె చేస్తూ ప్రభుత్వాన్ని ఎందుకు దూరం చేసుకుంటున్నారని అని కేటీఆర్ అన్నారు. ఉద్యోగస్తులు ఇలా రోడ్లపైకి రావొద్దని, ధర్నా, సమ్మెలు చేస్తే తమ పని తాము చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. త్వరలోనే రెగ్యులర్ చేస్తూ జీవోను విడుదల చేస్తామని, సమ్మెలు చేయొద్దని మంత్రి కేటీఆర్ తెలిపారు.

పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ ఈ నెల 15న జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవి గార్డెన్‌లో నిర్వహించిన జేఏసీ, అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్స్‌లో ఈ నెల 8న వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. పట్టణానికి పూర్వ వైభవం తేవడానికి అన్ని అర్హతలు ఉన్న చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయడంతో పాటు పట్టణ కేంద్రంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేసి, కొమురవెల్లి, చేర్యాల మీదుగా జనగామకు రైల్వేమార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆగం రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, కళావతి, సత్యనారాయణ, రంజిత్‌రెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ చంద్రమోహన్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల, గౌరాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఏ పీడీ చంద్రమోహన్‌రెడ్డి ఏపీఎం ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. ధాన్యం మిల్లులకు చేరగానే రైతుల అకౌంట్లో డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎం ప్రసాద్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సంపూర్ణ, వంశీ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలి

చేర్యాల(సిద్దిపేట): 137వ మే డేను పురస్కరించుకొని శుక్రవారం పట్టణ కేంద్రంలోని అంగడిబజార్ వద్ద గల అంబేడ్కర్ ప్రాంగణంలో మే డే వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మే డే స్తూపానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన కార్మిక, కర్షక, చిరు వ్యాపారులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ.. 8 గంటల పనికోసం, బడా పెట్టుబడిదారుల శ్రమ దోపిడిని అరికట్టేందుకు జరిగిన పోరాట ఫలితమే మే డే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు వెంకట్‌మావో, మల్లేశం, నాగరాజు, అరుణ్‌కుమార్, శ్రీహరి, భాస్కర్, శోభ, ప్రభాకర్, అజ్గర్, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు మహా పాదయాత్ర

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని హనుమాన్ మాలధారణ స్వాములు ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయ సన్నిధాన గురుస్వామి సంఘం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేట నుంచి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి మహాపాదయాత్రగా శుక్రవారం బయల్దేరారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే కోటిలింగాల ఆలయంలో స్వాములు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి కట్టుకొని కొండగట్టుకు బయల్దేరారు. దీంతో ఆలయ ఆవరణ శ్రీరామ నామస్మరణతో మార్మోగింది.

కలశాభిషేకం.. ఆధ్యాత్మిక పరిమళం



కలశపూజ నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): బ్రహ్మోత్సవ శోభతో వర్గల్ వేణుగోపాలుని కోవెల అలరారుతున్నది. ఉత్సవాల్లో మూడోరోజు శుక్రవారం ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకం నేత్రపర్వం చేసింది. ఆలయ మండపంలో అర్చకులు 108 కలశాలు స్థాపన చేసి కలశ పూజ నిర్వహించారు. ఏకపీఠంపై కొలువైన రుక్మిణి, సత్యభామ సమేత మూల విరాట్‌లకు భక్తజన సామూహిక సహస్ర ధారాభిషేకం చేశారు. అనంతరం అలంకార సేవ జరిపారు. ఉత్సవ వేడుకలు తిలకించి భక్తులు పునీతులయ్యారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేణుగోపాలుని కల్యాణోత్సవం సందర్భంగా వర్గల్ విద్యాధరి క్షేత్రం నుంచి స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. అదేవిధంగా శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణం కోసం విద్యాధరి ఆలయ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను వేణుగోపాలస్వామి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మరోవైపు రాత్రి 10 గంటలకు ప్రారంభమయ్యే వేణుగోపాలుని కల్యాణోత్సవ వేడుకల ఏర్పాట్లలో ఆలయ వర్గాలు నిమగ్నమయ్యారు.

కారోబార్ల సమస్యలను పరిష్కరించాలి



కొమురవెల్లిలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలంటూ విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కారోబార్లను బిల్ కలెక్టర్‌గా, బిల్‌కలెక్టర్‌లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా హోదా కల్పించి కనీస వేతనం రూ 21,500లు ఇవ్వాలన్నారు. వేతనాలు గ్రామ పంచాయతీల నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బ్రహ్మండ్లపల్లి పరశురాములు, శ్రీనివాస్, సాయిలు, అరవింద్, రవీందర్, ఉప్పలయ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: ఎన్నో రోజులుగా కారోబార్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ జీపీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కారోబార్లు, జీపీ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జీపీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, బీమా, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల కారోబార్లు, జీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుబ్బరాజేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

దుబ్బాకటౌన్: అక్బర్‌పేట–భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలో స్వయంభుగా వెలసిన దుబ్బరాజేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పార్వతి దుబ్బరాజేశ్వరస్వామిల కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణలు భక్తుల కరతాళ ధ్వనుల మధ్య కనుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహాస్నాపనం, మూలమంత్ర హవనం, బలిహరణ, స్వామివారి ఎదుర్కోలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేపట్టారు. సాయంత్రం 4.30 నుంచి ఔపోసన ఛండీ సప్తశతి హవనం, నందీశ్వర వాహనసేవ, భస్మార్చన, నీరాజన మంత్ర పుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.

అక్రమ అరెస్టులపై పోరాటం చేస్తాం

రాష్ట్ర హౌజ్ ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి



మాట్లాడుతున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అర్ధరాత్రి నుంచి బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, ఏబీవీపీ, వివిధ సంఘాల నాయకులను ఎక్కడికక్కడే ముందస్తుగా పోలీసులు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకుడు, రాష్ట్ర హౌజ్ ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ పర్యటన, సభను తాము అడ్డుకుంటామని, వ్యతిరేకిస్తున్నట్లు గానీ తాము ఎక్కడ ప్రకటించలేదన్నారు. అయినా పోలీసులు గ్రామీణ ప్రాంతాల నాయకుల ఇంటికి వెళ్లి అర్ధరాత్రి నుంచి అక్రమంగా అరెస్టులు చేశారని మండిపడ్డారు. కేవలం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మెప్పు పొందేందుకు అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అక్రమ అరెస్టులపై తాము హైకోర్టులో న్యాయ పోరాటానికి పోతామని వెల్లడించారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, వేణు, మండల అధ్యక్షుడు వీరాచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, సీపీఐ నాయకులు మల్లేశ, రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు ఉన్నారు.

కోహెడ(హుస్నాబాద్): హుస్నాబాద్‌లో నిర్వహించిన కేటీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో కోహెడ బీజేపీ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. సభ ముగిసిన అనంతరం విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, గుగ్గిళ్ల శ్రీనివాస్, నర్సయ్య, సురేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, రాంచంద్రారెడ్డి, శివకుమార్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ కరుణాకర్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు గ్రామంలో రూ.12లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీసీ(ముదిరాజ్)భవన నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ భూమిపూజ చేశారు. గ్రామ సర్పంచ్ కొమ్ముల స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణాకర్ పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి ఫలాలను పంచుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మీస పార్వతి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సిద్ధిలింగం, ముదిరాజ్ కుల పెద్దలు పొన్నం మైసయ్య, కోడూరు సాంబయ్య, పిట్టల అంజయ్య, జంగ నర్సింహులు, సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుకు అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధిత విభాగంలో పీజీ 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, అనుభవం, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలి**

తొగుట(దుబ్బాక): ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ గాందారి లతానరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బంజేరుపల్లిలో శుక్రవారం కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం లింగాపూర్, బంజేరుపల్లి, బండారుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, రజిత, శారద, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు కనకయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, ఏఎంసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ **వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం**

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో మహిళలు ఒడిబియ్యం, పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ **ఆర్థికసాయం**

సిద్దిపేటరూరల్: రాఘవాపూర్ గ్రామానికి చెందిన బండి ఏనమీది లచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో విషయాన్ని గ్రామ నాయకులు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి లచ్చవ్వ కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు నగదును ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

◆ **అన్ని కాలనీల్లో సీసీరోడ్లను నిర్మించాలి**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో సీసీరోడ్లను నిర్మించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో సీసీరోడ్ల పనులు కొన్ని కాలనీల్లో ఇంకా ప్రారంభం కాలేదన్నారు. పాలకులు, అధికారులు సమన్వయంతో మున్సిపాలిటీని ఒక యూనిట్‌గా తీసుకొని అన్ని కాలనీల్లో ఒకేసారి సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేసేలా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

◆ **సూరంపల్లి సర్పంచ్‌ను సస్పెండ్ చేయాలి**

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం సూరంపల్లి ఉపసర్పంచ్‌ను కులం పేరుతో దూషించిన సర్పంచ్ నర్సింలును వెంటనే ఆ పదవీ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డప్పు శివరాజ్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఉత్సవాల్లో సర్పంచ్ పాల్గొనకపోవడంపై వాట్సాప్ గ్రూపులో మెసేజ్ పెట్టినందుకు ఉపసర్పంచ్‌ను ఫోన్‌చేసి ఇష్టం వచ్చినట్లుగా సర్పంచ్ దూషించాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గని నర్సింహులు, బాలుగారి కృష్ణ, సాయిలు తదితరులు ఉన్నారు.

◆ **కేసు కొట్టివేత**

సిద్దిపేటకమాన్: ఆశ సమ్మె పోరాట కేసును విచారణ అనంతరం సిద్దిపేట కోర్టు కొట్టివేసినట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముత్యంరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో 2015లో జరిగిన 106రోజుల ఆశ సమ్మె పోరాటంలో భాగంగా పాదయాత్ర నిర్వహిస్తుండగా కుక్కునూర్‌పల్లి పోలీసులు సీఐటీయూ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముత్యంరావు, నాయకుడు కిష్టయ్య, ఆశ యూనియన్ అధ్యక్షురాలు ఎండి రబియాబేగం, తులసిలను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. 2016 నుంచి 2023 మే 5వ తేదీ వరకు విచారణ జరిపిన అనంతరం సిద్దిపేట కోర్టు శుక్రవారం కేసును కొట్టివేసినట్లు ముత్యంరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసు వాదించిన న్యాయవాది బాబురావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

◆ **సదస్సుకు హాజరుకావాలి**

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేటలో శనివారం నిర్వహించే జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశానికి అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు హాజరుకావాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నంగునూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే సదస్సులో భవిష్యత్ కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాజ్‌మాదిగతో పాటు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారన్నారు.